క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



పార్టీ అధినేతతో విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కలిశారు. మంగళవారం తాడేపల్లె వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజవర్గంలో చేస్తున్న పార్టీ కార్యక్రమాలు, ఇతర అంశాలపై మాట్లాడారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



'పొలం పిలుస్తోంది'లో ఏఓ వరలక్ష్మి

ఐరాల : ఖరీఫ్ పంటల సాగులో చీడపీడల నివారణకు తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటించాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని వడ్రాంపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వరి, వేరుశనగ సాగులో చేపట్టాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను వివరించారు.

కలుపు నివారణపై అవగాహన



పంటను పరిశీలిస్తున్న ఏడీఆర్ సుమతి

తవణంపల్లె : వేరుశనగలో కలుపు నివారణపై తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ వి.సుమతి అవగాహన కల్పించారు. మంగళవారం ఈ మేరకు ఆమె మాట్లాడుతూ డైక్లోసూలమ్ మందును వాడితే కలుపును సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. అనంతరం మండలంలోని కురప్పల్లె, తవణంపల్లెలో ఏఓ జి. ప్రవీణ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి, ఎంపీఈఓ జ్యోతి, వీపీఏ నవీన్ పాల్గొన్నారు.


ఆలయాల రక్షణలో యువత పాత్ర కీలకం



భక్త బృందంతో కమలానంద భారతీస్వామి

పూతలపట్టు(యాదమరి): ఆలయాల రక్షణలో యువత పాత్ర అత్యంత కీలకమని భువనేశ్వరి పీఠాధిపతి శ్రీకమలానందభారతీ స్వామి తెలిపారు. హిందూ దేవాలయాల యువ చైతన్య మహా పాదయాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రానికి చేరుకున్నారు. ఆయనకు హిందూ ధార్మిక భక్త బృందం ఘన స్వాగతం పలికింది. స్వామీజీ మాట్లాడుతూ హిందూ దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.


మహిళలకు జీవనోపాధి కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఈడీ శ్రీదేవి

తవణంపల్లె : మహిళలకు జీవనోపాధి కల్పన లక్ష్యమని బీసీ కార్పొరేషన్ ఈడీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎగువ తవణంపల్లె సచివాలయంలో 130 మందికి మహిళలకు టైలరింగ్‌లో 70 రోజుల ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈడీ మాట్లాడుతూ చేతివృత్తుల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఏఓ రెడ్డిబాబు, ఏపీఎంలు రవి, నాగరత్నమ్మ, మార్ట్ సీసీ ఆరోగ్యం పాల్గొన్నారు.

పాపసముద్రంలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: మండలంలోని పాపసముద్రంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. గుడిపాల డాక్టర్ సంధ్య రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక రుగ్మతలతో ఇంటికే పరిమితమైన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యసిబ్బంది విజయ, సోనియా, రుక్మిణమ్మ, ప్రభావతి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

ఏయ్ బిడ్డా.. ఇది గంజాయ్‌కి అడ్డా!

- పూతలపట్టు కేంద్రంగా అమ్మకాలు
- మత్తులో జోగుతూ దాడులకు తెగబడుతున్న యువత
- చాపకింద నీరులా విస్తరిస్తున్న మహమ్మారి
- ఏజెన్సీ,ఒడిస్సా ప్రాంతాల నుంచి అక్రమంగా దిగుమతి
- సూత్రదారుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు



పూతలపట్టు (యాదమరి) : గంజాయి మాఫియాకు పూతలపట్టు అడ్డాగా మారుతోంది. యువతను లక్ష్యంగా చేసుకుని జోరుగా అమ్మకాలు సాగిస్తూ తమ చీకటి వ్యాపారాన్ని గుట్టుచప్పుడు కాకుండా విస్తరింపజేస్తున్నారు. సిగరెట్, మద్యానికి అలవాటు పడిన కొందరు యువత ఇప్పుడు గంజాయి మత్తుకు అలవాటుపడుతున్నారు. బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాల్సిన యువత కొత్తదనం కోసం, కిక్కు కోసం మత్తుకు బానిసలై చిత్తవుతున్నారు. సరదాగా మొదలుపెట్టిన ఆ కొత్తదనం చివరకు ఆ మత్తుకు బానిసలవుతున్నారు. ఇదే అదనుగా భావించి గంజాయి వ్యాపారులు చెలరేగుతున్నారు.

ఏజెన్సీ, ఒడీశా ప్రాంతాల నుంచి కొందరు అక్రమంగా పూతలపట్టు మండలం బండపల్లికి రాత్రికి రాత్రే దిగుమతి చేస్తున్నారు. గతంలో పెద్ద నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన గంజాయి క్రమేణా గ్రామాలకు పాకుతోంది. కొందరు అక్రమ ఆదాయార్జన కోసం యువత ఆరోగ్యంపై చెలగాట మాడుతున్నారు. తాపీ పనులు చేసుకునే దినసరి కూలీలు తాము చేసే పనులలో కష్టం తెలియకుండా ఉండటానికి గంజాయి వాడుతుంటారు. వారిని సైతం టార్గెట్ చేసుకుని గంజాయి అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. కిరాణా దుకాణాలు, టీ సెంటర్లు, ఫ్లై ఓవర్లు, కాలేజీలు, నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని జోరుగా దందాను సాగిస్తూ పెద్ద మొత్తంలో వెనకేసుకుంటున్నారు. గంజాయిని కొందరు అధిక మోతాదులో వాడటంతో అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

అక్రమ రవాణాకు తోడ్పాటు

ప్రస్తుతం నేటి యువత స్నేహితులతో కలసి గంజాయి సేవిస్తూ వ్యసనానికి గురవుతున్నారు. వ్యాపారులు యువకులను లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.పెద్ద మొత్తంలో కొనలేనివారి కోసం చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మత్తుకు బానిసలుగా మారిన కొందరు యువకులు గంజాయిని కొనలేక ఏజెంట్లుగా మారుతున్నారు.అక్రమ రవాణాలో భాగమవుతున్నారు. వచ్చిన కమీషన్లతో గంజాయిని కొనుగోలు చేసి మత్తులో తూలుతున్నారు. కొందరు యువత కేవలం గంజాయి కోసమే కిరాయి రౌడీలుగా మారి దాడులకు తెగబడుతున్నారు. పలు గొడవలకు కారణమయ్యి పోలీసు కేసుల్లో చిక్కుకుని బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు.

పట్టుబడుతున్నా..

గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై పోలీసులు మెరుపు దాడులు చేసి కేసులు బనాయించి రిమాండ్‌కు తరలిస్తున్నా..నిందితులు బెయిల్‌పై విడుదల అవుతున్నారు. బయటకు రాగానే యథేచ్ఛగా మళ్లీ వారి చీకటి దందాను కొనసాగిస్తూ గంజాయి సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంలో ఆరితేరిన కొందరు బడా స్మగ్లర్లు భారీ మొత్తంలో గంజాయిని తరలించడానికి పోలీసులను డైవర్ట్ చేస్తున్నారు.ఈ క్రమంలోనే తక్కువ మోతాదు సరుకును తమ ఏజెంట్లకు ఇచ్చి పోలీసులకు సమాచారం అందించి పట్టుబడేలా చేస్తున్నారు. దీంతో పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకున్న గంజాయిని చేరాల్సిన చోటుకు తరలించి భారీగానే జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం.ఇకనైనా సంబంధిత పోలీసు శాఖ గంజాయి మహమ్మారికి అడ్డుకట్ట వేసి యువత బంగారు జీవితాలను నిలబెట్టి తల్లిదండ్రుల మనోవేదనను తీర్చాలని బాధితులు కోరుతున్నారు. డ్రోన్ల సాయంతో గంజాయి వినియోగదారులు, స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపి గంజాయిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది.

పీడీ యాక్టు నమోదు చేస్తాం



గంజాయి అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా పీడీ యాక్టు నమోదు చేసి వారి ఆస్తులను జప్తు చేస్తాం. గంజాయి వినియోగదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. విద్యాసంస్థలు, గ్రామాలలో గంజాయి వాడకంపై జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి స్మగ్లర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఈగల్ టీమ్‌తో పోలీసు శాఖను సమన్వయం చేసుకుని త్వరలోనే గంజాయిని సమూలంగా నిర్మూలిస్తాం.

– కృష్ణమోహన్, సీఐ, పూతలపట్టు

శ్రీపురం సత్రం.. అన్యాక్రాంతం..?

సాక్షి టాస్క్‌ఫోర్స్ : శ్రీపురం సత్రానికి చెందిన భూములు ఏమయ్యాయి..? బజారువీధిలోని ఆస్తులు ఎవరి ఆధీనంలో ఉన్నాయి..? బాడుగలు ఎవరి జేబులోకి వెళుతున్నాయి..? ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు ఏం చేస్తున్నట్టు...అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ తొలిచేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నగరం సంతపేటలో శ్రీపురం సత్రం ఉంది. అలాగే బజారువీధిలో కూడా ఈసత్రానికి సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. ఈ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో పూర్వకాలంలోనే సత్రంలో అన్నదానం చేసేవారు. స్థానికులతో పాటు కాణిపాకం వెళ్లే భక్తుల ఆకలి తీర్చేవారని పెద్దలు చెబుతున్నారు. అయితే ఈ ఆస్తి కొన్నేళ్లుగా అన్యాక్రాంతంలో ఉంది. ప్రతినెల సుమారు రూ.80వేల బాడుగలు వస్తుంటే.. ఆ సొమ్ము ఎవరి జేబులోకి వెళుతోందో తెలియని పరిస్థితి. దీనిపై దేవదాయశాఖ అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. ఈఓ మునిశేఖర్‌ను వివరణ కోరగా.. బజారువీధిలోని శ్రీపురం సత్రం ఆస్తిని అనుభవిస్తున్న వారికి నోటీసులు ఇచ్చామని, త్వరలో చర్యలు ఉంటాయని తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణాలపై నివేదిక ఇవ్వండి

–కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో నిర్మిస్తున్న గోకులం షెడ్ల పనితీరుపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డ్వామాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతివారం గోకులం షెడ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష ఉంటుందన్నారు. మండలాల్లో ఎన్ని అభివృద్ధి పనులు ఆమోదించారు? ఎన్ని పనులు పూర్తి చేశారు? పశువుల షెడ్ల గోడల నిర్మాణం ఎంత వరకు పూర్తయింది? అనే వివరాలతో నివేదిక ఇవ్వాలన్నారు. పనుల పురోగతిలో ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నులి పురుగుల రహిత సమాజ స్థాపనకు కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జేడీ సునీల్‌కుమార్ నాయక్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ) సునీల్‌కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేడీ మాట్లాడారు. నులిపురుగుల రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓ–2 మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ 97 శాతం పూర్తి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభించిన నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమం 97 శాతం పూర్తయినట్లు ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ తెలిపారు. మొత్తం 3,62,534 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా తొలి రోజు 3,51,648 మంది పిల్లలకు అందజేశారు. మిగిలిన పిల్లలకు కూడా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఘనంగా సంకటహర చతుర్థి



వసంతాపురంలో పూజలు చేస్తున్న పండితులు

గుడిపాల: మండలంలో వసంతాపురంలోని సుందర వినాయకస్వామి దేవాలయంలో మంగళవారం ఘనంగా సంకటహర చతుర్థి నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి పూజలు, అభిషేకం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తిపాటలు పాడారు. అనంతరం మొక్కులు చెల్లించారు.

మండల మీట్ రేపు

బంగారుపాళెం : మండల సాధారణ సర్వసభ సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహేష్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

ర్యాగింగ్ చేస్తే జైలుకే..!



నిరసన వ్యక్తం చేస్తున్న పీవీకేఎన్ కాలేజీ అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి హెచ్చరించారు. ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ కళాశాలలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ర్యాగింగ్ అనేది ఒక విష సంస్కృతి అని, ర్యాగింగ్‌కు పాల్పడితే చేజేతులా భవిష్యత్తు నాశనం చేసుకున్నట్టేనన్నారు. ర్యాగింగ్‌ను నిరోధించడానికి ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నిరసన

తమ దీర్ఘకాలిక సమస్యలపై పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అధ్యాపకుల బదిలీలు, సీపీఎస్ తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు పూనుకోవాలన్నారు. కార్యక్రమంలో జీసీటీఏ, జీసీజీటీఏ సంఘాల నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ నిర్వీర్యం



గేట్ ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పలమనేరు: పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు కారణంగా ఆర్టీసీ నిర్వీర్యమై అక్కడి ఉద్యోగులు పడుతున్న కష్టాలు ఇక్కడ రాకుండా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్టీఓ అధ్యక్షులు ఆనందబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిపో వద్ద ఎస్‌ఎంయూఏ ఆధ్వర్యంలో గేట్ ధర్నా చేశారు. ఆనందబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి పెండింగ్‌లోని డీఏ తదితరాలను ఇవ్వాలన్నారు.. ఇక్కడ త్వరలో అమలు చేసే స్త్రీశక్తిలో హేతుబద్ధతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, జాయింట్ సెక్రటరీ యాగంరెడ్డి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు బాబు, రత్నం, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓంశక్తి పూజలు



గుడిపాల: ఆడి నెల సందర్భంగా మండలంలోని గొల్లపల్లెలో మంగళవారం ఓంశక్తి, సత్యమ్మకు గ్రామస్తులు ఘనంగా పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి, అంబలి సమర్పించి, మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు.



అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఓంశక్తి

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రభుప్రేమ్‌కుమార్

ఐరాల : ఖాతాదారుల శ్రేయస్సే ధ్యేయంగా యూకో బ్యాంక్ పనిచేస్తుందని బ్యాంక్ విజయవాడ జోనల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ ఎం.ప్రభుప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాతపాళ్యంలో మహిళా ఖాతాదారులతో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆర్‌ఈ–కేవైసీ, సూక్ష్మ బీమా యోజన, జీవన జ్యోతి, బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూకో బ్యాంక్ బ్రాంచి మేనేజర్ భానుచందర్ మాట్లాడుతూ సోషియల్ సెక్యూరిటీ స్కీమ్స్ ఆవశ్యకత వివరించారు. ఏపీజీబీ మేనేజర్ రజీవుల్లా, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్లు తేజ, దిక్షతి, బ్యాంక్ సిబ్బంది బాషా, జవహర్, సంఘమిత్ర సభ్యులు గీత పాల్గొన్నారు

కుక్క తెచ్చిన తంటా..!

చౌడేపల్లె: కుక్క హఠాత్తుగా అడ్డుగా రావడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి తీవ్రగాయాల పాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లె–బోయకొండ మార్గంలోని మల్లువారిపల్లె బస్టాప్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దపంజాణి మండలం వీరప్పల్లెకు చెందిన గుర్రప్ప, కోటూరుకు చెందిన బాషా బోయకొండ నుంచి టీవీఎస్ ఎక్సెల్‌లో చౌడేపల్లె వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో కుక్క మూలాన ప్రమాదానికి గురయ్యారు.

సిబ్బందితో సొంత పనులు!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని ఓ అధికారి సొంత పనులకు వాడేస్తున్నారు. విధులను పక్కన పెట్టించి ఇంటి పనులకు పనులకు పంపుతున్నారు. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారు. వివరాలు.. చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో 25 మందికిపైగా అటెండర్, స్వీపర్, వాచ్‌మెన్ వంటి స్థాయిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో మహిళా సిబ్బందిగా 12 మంది వరకు పనిచేస్తున్నారు. వీరిని కార్యాలయంలో సూపర్‌పవర్‌గా వ్యవహరిస్తున్న ఓ అధికారి ఇంటి పనులకు వాడేస్తున్నారు. ఆయన కార్యాలయానికి ఉదయం 10.30గంటలకు చేరుకుంటే..సిబ్బంది షిఫ్టుల వారీగా ఆయన ఇంటికి వెళ్లి పనిచేయాల్సిందే. వాళ్ల చేత ఇల్లు శుభ్రం చేయడం, బట్టలు ఉతకడం, పాత్రలు కడగడం వంటి పనులు చేయించుకుంటున్నారు. ఇలా ప్రతి రోజూ ఆఫీసు పనులు వదిలి ఇంటి పనికే సిబ్బంది పరిమిత మవుతున్నారు. దీనిపై నోరు విప్పితే ఆ అధికారి తమ కడుపుపై కత్తి పెడుతున్నారని, యూడీసీకి చెప్పి జీతాలు ఆపేస్తున్నారని సిబ్బంది భయపడుతున్నారు. ఈ విషయం మీడియా వరకు రావడంతో మంగళవారం మధ్యాహ్నం సిబ్బందిని పిలిచి.. ఇంటి పనికి పంపిస్తున్నా విషయం బయటకు ఎలా తెలిసింది..? ఇంట్లో పనిచేసే వీడియోలు ఎలా బయటకు వెళ్లాయి.? ఈ పని చేసేంది ఎవరంటూ భయాభ్రాంతులకు గురి చేశారు. ఇంటి పని చేస్తున్నట్లు ఎవరైనా బయట చెబితే మీ ఉద్యోగాలు ఉండవని బెదిరించినట్లు తెలిసింది. కాగా, సదరు అధికారి ఇల్లు కూడా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉండడం గమనార్హం.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి ముఖ్యం



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: పేదలకు నిర్మిస్తున్న ఎన్టీఆర్ హౌసింగ్ గృహ నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాల్లో పురోగతి ముఖ్యమని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షించారు. నగరంలోని పలు లేఔట్లలో ఇళ్ల నిర్మాణం వేగంగా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శులు నిత్యం కాలనీలను పరిశీలిస్తూ, లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'నులి' నివారణే లక్ష్యం

ఐరాల : పూతలపట్టు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మంగళవారం ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు ఐరాల మండలంలో వైద్యాధికారులు రెడ్డెప్ప, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, హెచ్‌ఎం లతాప్రియా, పీహెచ్‌ఎన్ వేదవతి, ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, మనోహర్, హెల్త్ అసిస్టెంట్ అయ్యప్ప పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి : వైద్యాధికారులు అనిల్‌కుమార్ నాయక్, ఎంఈఓ రుక్మిణి, కె.గొల్లపల్లి హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపల్ లలిత, యాదమరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, కనకాచారి, హెల్త్ సూపర్‌వైజర్ సెల్వరాణి ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు

బంగారుపాళెంలో..

బంగారుపాళెం : మండలంలోని పాఠశాలల్లో పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయల్, టేకుమంద పాఠశాల హెచ్‌ఎం గిరిజారా పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె : విద్యార్థుల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. డాక్టర్ ప్రియాంక, ఎంఈఓ హేమలత, డాక్టర్ మోహన్‌వేలు, ఎంఈఓ మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి, సీహెచ్‌ఓలు జ్ఞానశేఖర్, రాజామణి, పీహెచ్‌ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, గోపి, నిర్మలమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.



యాదమరిలో జెడ్పీ హైస్కూల్‌లో..



తవణంపల్లె హైస్కూల్‌లో..

పూతలపట్టులో..

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు ప్రాథమిక పాఠశాలలో పిల్లలతో నులి నివారణ మాత్రలు మింగించారు. డాక్టర్ వినయ్, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ మాళిలామణి పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్, సీఎస్‌ఆర్ కళాశాల, పాపసముద్రంతో పాటు పలు పాఠశాలల్లో మంగళవారం 3,481 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారులు సంధ్య, చంద్రమహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.